క్లుప్తంగా

పాఠశాలల రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న కార్యాలయ సిబ్బంది

కొయ్యూరు: పాఠశాలల నిర్వాహణ ఖర్చులు 2023–24కు సంబంధించి ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం ఆడిట్‌లో భాగంగా రికార్డులను తనిఖీ చేశారు. రెండు రోజుల్లో పాడేరు విద్యా శాఖ కార్యాలయంలో ఖర్చులపై ఆడిట్ నిర్వహిస్తారు. అయితే ఉపాధ్యాయులు రికార్డులను తీసుకురావడం సాధ్యం కాదని చెప్పడంతో ఇక్కడ కార్యాలయంలో రికార్డులు పరిశీలన చేశారు. మండలంలో 150 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు రికార్డులను తీసుకువచ్చి అప్పగించారు.

సకాలంలో రేషన్ సరకులు అందించాలి



సూచనలిస్తున్న తహసీల్దార్ నాగమణి

అడ్డతీగల: మండంలోని ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు, వీర్వోలతో తహసీల్దార్ పి.నాగమణి శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో రేషన్ సరకులను లబ్ధిదారులకు అందించాలన్నారు. పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి వెంటనే తీసుకురావాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ ఒక్కరికీ నిత్యావసర సరకులు అందలేదనే ఫిర్యాదు ఉండకూడదన్నారు. ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని కోరారు.

61 మందికి వైద్య పరీక్షలు



మారేడుబాకలో రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: మండలంలోని మారేడుబాక, రత్నాలపేట గ్రామాల్లో శుక్రవారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరంలో 61 మందికి సేవలందించినట్టు డాక్టర్ నాగార్జున తెలిపారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి అవసరమైన ఆరోగ్య సలహాలు ఇచ్చామన్నారు. సుగర్, బీపీ సమస్యలున్న వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఏఎన్‌ఎం కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ సరస్వతి, హెల్వీ రమణ, హెల్త్ అసిస్టెంట్ రాజుబాబు, 104 డీఈఓ శ్రీనివాస్ ఆశలు పాల్గొన్నారు. తాళ్లపాలెంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు 104 డీఈఓ శ్రీనివాస్ తెలిపారు. గ్రామస్తులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను

ఎటపాక: షెడ్యూల్ ప్రాంతాల ఉద్యోగాల నియామకాల చట్టం రూపకల్పన తరువాతే మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 డీఎస్సీ ద్వారా భర్తీ చేసే ఉపాధ్యాయ పోస్టులను స్థానిక ఆదివాసీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని కోరారు. ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. ప్రభుత్వ గిరిజన నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు. మండల కమిటీ అధ్యక్ష ,కార్యదర్శులు కాక రాజు, శివశంకర్, కోశాధికారి కిరణ్, నాయకులు ప్రవీణ్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

వర్షాకాలం... వ్యాధుల గాలం

- జ్వరాలు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తం
- మలేరియా కేసులపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యాధికారుల సూచనలు



దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది



అనంతగిరిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

అనంతగిరి: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దీంతో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందిని, జిల్లా డీఎంహెచ్‌వో, డీఎల్‌పీవో అధికారులు అప్రమత్తం చేశారు. గిరిజన ప్రాంతం మారుమూల గ్రామాల్లో విషజ్వరాలు, టైఫాయిడ్, డయేరియా కేసులు నమోదవుతున్నాయి. దీంతో పాటు దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలుతుండడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఇందులో భాగంగా ఓ వైపు మొదటి విడత పిచికారీ స్ప్రెయింగ్ చేయించారు. మరోవైపు ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నివారణకు చర్యలు చేపట్టారు..మండలంలోని పినకోట, భీమవరం, అనంతగిరి, లంగుపర్తి పీహెచ్‌సీ పరిధిలోగల పలు గ్రామాల్లో మలేరియా కేసులు నమోదవుతుండడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమైయ్యారు.హైరిస్క్ గల గ్రామాల్లో ముందుగా పిచికారీ(స్ప్రెయింగ్) పనులను కూడా పూర్తిచేశారు.

రెండు విడతల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్

మలేరియా కేసుల నియంత్రణకు విడతల వారీగా గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ మొదటి 15 నుంచి మే 31వ తేదీ వరకు మొదటి విడతలోని 202 గ్రామాల్లో పిచికారీ స్ప్రెయింగ్ పనులు మలేరియా సిబ్బంది చేపట్టారు. రెండో విడతలోని 202 గ్రామాల్లో స్ప్రెయింగ్ పనులను అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూలై నెల మొదటి వారం నుంచి ఆగస్టు 15 రెండో విడత స్ప్రెయింగ్ పనులు పూర్తి చేస్తారు.

మొదట విడతలో

మండలంలోని ప్రధానంగా భీమవరం పీహెచ్‌సీ పరిధిలోని గోట్లిపాడు, పూతికవలస, బూరదగెడ్డ, చిప్పపల్లి, గుమ్మకోట, దుండువలస, దబ్బలపాడు, సింగవరం తదితర గ్రామల్లో మలేరియా కేసులు అధికంగా నమోదవుతుండడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమైయ్యారు. గతం కంటే కొంతవరకు మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని చెబుతున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా, జోనల్ అధికారులు మలేరియా కేసులపై సిబ్బందిని అప్రమత్తం చేస్తూ సలహాలు సూచనలు ఇస్తున్నారు.

ప్రజలకు అవగాహన

డెంగ్యూ, మలేరియా, జ్వరాలపై ఇప్పటికే వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిసరాల్లో నీటి నిల్వలేకుండా చూడడం, బ్లీచింగ్ చల్లించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇళ్ల పరిసరాలు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వలేకుండా చూడాలి.
- ఖాళీ కొబ్బరి బొండాలు, టైర్లు, రుబ్బురోళ్లు, కూలర్లు, తొట్టెలు, నిల్వ నీరు ఉంటే దోమలు చేరే అవకాశం ఉంటుంది.
- వాడకం నీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లే మార్గం ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంటి కిటికీలు, తలుపులు మూసివేయాలి.
- ప్రతి ఇంట్లో దోమతెరలు వాడాలి.

మలేరియా నివారణకు చర్యలు



హైరిస్క్ గ్రామాలపై మొదటిగా ర్యాపిడ్ టెస్టులు, అలాగే స్ప్రెయింగ్, నీటి నిల్వ ప్రదేశాల్లో స్ప్రెయింగ్ ఇంటి లార్వల్ ఆపరేషన్ చేపట్టాం. వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది సహకారంతో ఫాగింగ్ యంత్రం ద్వారా దోమల నివారణకు చర్యలు చేపట్టాం. ఫ్రైడే రోజును డ్రైడేగా ప్రకటించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మలేరియా కేసులు నమోదైతే వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి, మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం.

– సంతోష్, వైద్యాధికారి, భీమవరం పీహెచ్‌సీ

పాముకాటుతో గిరిజనుడికి అస్వస్థత



బాధితుడు కృష్ణారావును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, సర్పంచ్ రమేష్

ముంచంగిపుట్టు: మండలంలో గల జర్జుల పంచాయతీ కులబీరు గ్రామానికి చెందిన గిరిజనుడు గెడ్డంగి కృష్ణారావు(35)కు శుక్రవారం ఉదయం పాముకాటుకు గురై అస్వస్థతకు గురయ్యాడు. సకాలంలో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కులబీరు గ్రామానికి చెందిన గిరిజన రైతు కృష్ణారావు ఇంటి సమీపంలో మొక్కలు నాటుతుండగా అకస్మాత్తుగా పొదల చాటున ఉన్న పాము కృష్ణారావు చేతిపై కాటు వేసింది. దీంతో కేకలు వేసి, అస్వస్థతకు గురైయ్యాడు.దీంతో హుటాహుటినా కుటుంబ సభ్యులు కృష్ణారావును ప్రైవేట్ వాహనంలో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి సంతోష్ వైద్య సేవలు అందించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని, ప్రస్తుతం వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉంచడం జరుగుతుందని వైద్యాధికారి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంగడ రమేష్, నాయకులు సీహెచ్‌సీకి వెళ్లి కృష్ణారావును పరామర్శించారు. అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని వారు కోరారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఆస్పత్రి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు

పాడేరు: పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్య విధాన పరిషత్ ద్వారా పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును తన నివాసంలో కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. గత ఐదు నెలలుగా తమకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని, పస్తులతో విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమ వేతనాలు కూడా పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. దీనిపై ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు స్పందించి సమస్యను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నష్టపరిహారం అందించాలని

హుకుంపేట: విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణిపై పాడేరులో శుక్రవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు గొండ్వాన దండకారుణ్యా పార్టీ అరకు ఇన్‌చార్జి చుంచు రాజుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీలకు సక్రమంగా వైద్యం అందడం లేదని, పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, రోగుల పట్ల దురుసుగాప్రవరిస్తున్నట్టు పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నష్టపరిహారం అందించాలని వినతి



సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న తాజంగి గ్రామస్తులు

చింతపల్లిరూరల్: ఎన్‌హెచ్ 516ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూమి, ఇళ్లు కొల్పోయిన వారికి తగిన నష్ట పరిహారం అందించాలని తాజంగి గ్రామస్తులు కోరారు. ఈ విషయంపై తాజంగి గ్రామస్తులు చెట్టి శంకర్, బేదర కొండబాబు, శీసా సుమిత తదితరులు పాడేరులో శుక్రవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో తాము కోల్పోయిన ఇళ్లు, భూములు తదితర ఆస్తులకు తగిన నష్ట పరిహారం అందలేదని, పరిహారం చెల్లింపు విషయంలో ఎన్‌హెచ్ 516 నిర్మాణ నిర్వాహకులు పొంతన లేని సమాధానం చెబుతున్నారని వినతిలో పేర్కొన్నారు. ఈ విషయం పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

గ్రామ కమిటీలను సన్నద్ధం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్

వీఆర్ పురం: వరదల కాలంలో పునరావాస, సహాయక చర్యల్లో కీలక పాత్ర పోషించే గ్రామ స్థాయి కమిటీలను పూర్తి స్థాయిలో సన్నదం చేయాలని రెవెన్యూ అధికారులను తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాస్ట్ వెరిఫికేషన్, నిత్యావసర సరకుల పంపిణీ, వరదలు, పునరావాసం తదితర అంశాలపై వారితో చర్చించారు. సమావేశంలో ఆర్‌ఐ రామకృష్ణ ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శశికాంత్

జి.మాడుగుల: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినా తక్షణమే వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులకు తెలియజేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ తెలిపారు. మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 12 మంది జ్వర పీడితులకు ఆర్డీటీలు చేయగా ఒకరికి మలేరియా పాజిటివ్‌గా తేలింది. విద్యార్థినికి వెంటనే మొదటి రోజు డోసు మందులు అందించారు. మిగిలిన 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వాతావరణ మార్పుల వలన ఆరోగ్యపరమై సమస్యలు తలెత్తుతాయని తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులకు కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగాలని ఆయన సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.ప్రకాష్, హెచ్‌ఎం సుమిత్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ అమలు తప్పనిసరి



రేగడిపాలెం పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న ఎంఈవో తాతబ్బాయిదొర

వై.రామవరం: మండలంలోని రేగడిపాలెం ఎంపీపీ పాఠశాలను ఎంఈవో కె.తాతబ్బాయిదొర శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజన ఆహార పదార్థాలను పరిశీలించారు. భోజనాన్ని రుచిచూసి ఆయన స్వయంగా విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పదార్థాలను వండి పెట్టాలని, మెరుగైన బోధన అందించాలని హెచ్‌ఎం ఎల్.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులకు సూచించారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి



నూతన కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, కార్యదర్శి రమేష్

జి.మాడుగుల: జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని సూరిమెట్ట గ్రామంలో శుక్రవారం జి.మాడుగుల మండల వినియోగదారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి రమేష్ కిముడు ఆధ్వర్యంలో మండల వినియోగదారుల సంఘం ఎన్నిక జరిగింది. మండల వినియోగదారుల సంఘం నూతన అధ్యక్షుడిగా కె.మాలంనాయుడు, ఉపాధ్యక్షుడిగా ఎల్.బాలన్న, ప్రధాన కార్యదర్శిగా జె.శ్రీను, కార్యదర్శిగా ఎం.చిన్నారావు, జాయింట్ సెక్రటరీగా పి.యోహన్, కోశాధికారిగా కె.కేశవరావు సభ్యులుగా లక్ష్మణరావు, చిన్నారావు, ఆదిబాబు, లింగన్న,సన్యాసిరావు, రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన చిట్టిబాబు మాట్లాడుతూ మండల వినియోగదారుల నూతన కమిటీ నిజాయితీగా వ్యవహరిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. వినియోగదారుల హక్కులు, చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు వాటిని కాపాడాలని, నిస్వార్థంగా సేవ చేయాలని ఆయన సూచించారు.

మన్యం అరటికి గిరాకీ



సంతలో అమ్మకానికి తీసుకొస్తున్న అరటిగెలలు

సాక్షి,పాడేరు: పాడేరు పాత బస్టాండ్‌లో శుక్రవారం జరిగిన సంతలో అరటి గెలలకు డిమాండ్ నెలకొంది. పర్యాటక ప్రాంతం డల్లాపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు పెరట్లో సాగు చేసిన అరటి పక్వానికి రావడంతో గెలలను సేకరించి పాడేరు సంతకు తీసుకువచ్చారు. ముకిరి, కొమ్మ రకంతో పాటు దేశవాళీ అరటి గెలల అమ్మకాలు జరిపారు. ఒక్కోక్క గెలకు 200 నుంచి 500వరకు ఉన్న అరటికాయలు ఆకట్టుకున్నాయి. సేంద్రియ పద్ధతిలో సాగు చేసే ఏజెన్సీ అరటి పండ్లు మంచి రుచికరంగా ఉండడంతో మైదాన ప్రాంతాల్లో డిమాండ్ ఉంది. దీంతో అధిక ధరలతోనే మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ మేరకు సంతలో పెద్ద అరటిగెల రూ.700లకు గాను, చిన్న గెల రూ.400తోను అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం సంతల్లో అరటికి గిట్టుబాటు ధరలు రావడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు.

ముందస్తు వరద సహాయక చర్యలకు వినతి



తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఎటపాక: రానున్న గోదావరి వరదలకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆద్వర్యంలో తహసీల్దార్ శేఖర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఐవి మట్లాడుతూ గత ఏడాది వరదలకు ముంపు ప్రాంత ప్రజలు సకాలంలో సహాయక చర్యలు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద ముంపు ప్రజలకు పునరావాసం కల్పించటం, బఫర్ స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు మాధవరావు, ఆకిశెట్టి రాము, హుస్సేన్, సుధాకర్, రాంబాబు ఉన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

మునగపాక: స్థానిక సంతబయలులో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో హోమం, తమలపాకులతో సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



స్వామి వారి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

గొలుగొండ: జానకీరాంపురంలో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలో రామాలయ నిర్మించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుక నిర్వహించారు. ఇందులో భాగంగా రామాలయం వద్ద సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేదపండితుల సమక్షంలో కల్యాణోత్సవం నిర్వహించగా, గ్రామస్తులు పాల్గొన్నారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వ్యవసాయంలో మెలకువలు పాటించాలి



రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఏవో శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు వ్యవసాయంలో మెలకువలు పాటించాలని మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసబాబు అన్నారు.మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ పెద్దపుట్టులో గిరిజన రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో నిర్వహించారు. 86 మంది రైతులకు శుక్రవారం విత్తనాలతో పాటు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసబాబు మాట్లాడుతూ మండలంలో 769.10 క్వింటాలు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రందించి విత్తనాలు పొందాలని, 23 పంచాయతీల్లో ఈ ఏడాది 3,572 హెక్టార్లులో వరి సాగు చేయనున్నారని చెప్పారు. రైతులంతా వ్యవసాయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ పంటలు వేసుకోవాలని ఆయన సూచించారు. సచివాలయ వ్యవసాయ అధికారులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీపై అవగాహన సదస్సు రేపు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయం ఆదివారం సాయంత్రం 4 గంటలకు టెట్, డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయ 81వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డీఎస్సీకి సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ, యువకులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


సర్పంచ్ చొరవతో రహదారి పనులు



రహదారి మరమ్మతు పనులు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీ కేంద్రానికి వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా తయారైంది. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు బురదలో కూరుకుపోయి, బయటకు తీసేందుకు వచ్చేందు నానా అవస్థలు పడుతున్నారని పలువురు చెబుతున్నారు. కాలినడక వెళ్లే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో సర్పంచ్ భాగ్యవతి, ఆమె భర్త సురేష్‌లు తమ సొంత డబ్బులు వెచ్చించి, శుక్రవారం పోక్లెయిన్ ద్వారా రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. దీంతో మార్గం సుగుమం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యవతి మాట్లాడుతూ అధికారులు జర్రెల రోడ్డును అసంపూర్తిగా వదిలేయడంతో రహదారిపై వేసిన మేటల్ అంతా వరద నీటితో కొట్టుకుపోయి, గోతులు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రహదారి పనులు ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని ఆమె కోరారు. రహదారి మరమ్మతుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి గ్రామంలో ధార్మిక సమితి



మాట్లాడుతున్న ధర్మ ప్రచారకులు

ఎస్.రాయవరం: ప్రతి గ్రామంలోనూ ధార్మిక సమితులను ఏర్పాటు చేసి, హిందూ సంప్రదాయాలను ఆచరించేలా చూడాలని సమరసత సేవా ఫౌండేషన్ విభాగ సంయోజక్ గురిమెళ్ల రాధాకృష్ణ అన్నారు. స్థానిక నూకాంబిక ఆలయంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ధార్మిక సమితులు నెలకొల్పాలని జిల్లా, మండల కన్వీనర్లకు సూచించారు. హిందూ దేవాలయాల ఆవశ్యకతపై ప్రత్యేక అవగాహన పెంచుకుని, హిందువులకు హితబోధ చేయాలన్నారు. పేద, నిమ్న వర్గాల్లో మత మార్పిడులను తగ్గించే క్రమంలో హిందూ సంప్రదాయాన్ని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పోతు రంగారావు, ఆడారి గంగాధర్, శిరియాల సత్యనారాయణ, మండల కన్వీనర్ ముత్తా గోవిందరావు, మహిళా కన్వీనర్ పెదపాటి లక్ష్మి, పలు మండలాల సహసంయోజన సభ్యులు అర్చకులు, ధర్మప్రచారకులు తదితరులు పాల్గొన్నారు.